
నవభూమి
కరీంనగర్
అనుబంధం
12 సెప్టెంబర్,2024 గురువారం పేజీలు:3
www.epaper.navabhoomi.in


## ఎత్తిపోతలకు
# ఎదురుచూపులు



**సిరిసిల్ల –నవభూమి:** కాళేశ్వరం ఎత్తిపోతలతో మెట్ట ప్రాంతంలో పంటలకు నీళ్లు ఎప్పుడు చేరుతాయోనని అన్నదాతలు ఎదురు చూస్తున్నారు. పథకంలో భాగంగా 9వ ప్యాకేజీలో మల్క పేట రిజర్వాయర్ నిర్మించారు. మిడ్ మానేరు నుంచి ట్రయల్‌రన్ కూడా నిర్వహించారు. ఏడాది దాటినా ప్రారంభోత్సవానికి మోక్షం లభించడం లేదు. ప్రాజెక్టుకు తెలంగాణ రైతాంగ ఉద్యమకారుడు, మాజీ ఎమ్మెల్యే దివంగత సీహెచ్ రాజేశ్వర్‌రావు పేరును నామకరణం చేశారు. ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైన వాయిదాలతో నిలిచిపోయింది. ట్రయల్ రన్‌తో గత ప్రభుత్వ హయాంలోనే అన్నదాతలకు రిజర్వాయర్ చేరువవుతుందని భావించారు. సిరిసిల్ల మానేరు వాగుపై 27 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్టుకు అనుసంధానంగా జిల్లాలోని అనంతారం అన్నపూర్ణ ప్రాజెక్ట్ నిర్మించారు. మరోవైపు కోనరావుపేట మండలం మల్కపేట వద్ద రిజర్వాయర్ పూర్తి చేశారు. గతేడాది మే, జూన్‌లో మిడ్ మానేరు నుంచి ఒక టీఎంసీ నీటిని ప్రాజెక్ట్‌లోకి నింపి ట్రయల్‌రన్ నిర్వహించారు. అప్పటి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుతో ప్రారంభోత్సం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. రెండు సార్లు వాయిదా పడింది. చివరకు ప్రభుత్వం మారడం, కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో లోపాలు తలెత్తడం, మిడ్‌మానేరులోకి ఎత్తిపోతలు నిలిచిపోవడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. ప్రస్తుత వానాకాలం సీజన్‌తో ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి మిడ్ మానేరులోకి నీటిని ఎత్తిపోస్తున్నారు. 27 టీఎంసీల సామర్థ్యం ఉన్న మిడ్ మానేరులో ప్రస్తుతం 17 టీఎంసీల నీరు చేరడంతోనే మిడ్ మానేరు నుంచి అనంతారం అన్నపూర్ణ ప్రాజెక్ట్‌లోకి అక్కడి నుంచి రంగనాయకసాగర్, మల్లన్నసాగర్ వరకు నీటిని విడుదల చేశారు. దిగువన ఉన్న ఎల్ఎండీ ప్రాజెక్ట్‌తోపాటు కాలువల ద్వారా కూడా నీటిని విడుదల చేస్తున్నారు. తోటపల్లి, గౌరవెల్లి ప్రాజెక్ట్‌ల వరకు ఉన్న ఆయకట్టుకు నీరందిస్తున్నారు. అంతా సిద్ధం చేసినా మల్కపేట ప్రాజెక్ట్‌లోకి నీటిని ఎత్తిపోయక పోవడం, ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు.తాగు, సాగునీరు గోస తీరేనా? గోదావరి జలాల పరవళ్లతో జిల్లా కళకళలాడింది. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో ఏర్పడిన అవాంతరంతో ఆందోళనలు నెలకొన్నాయి. అనంతరం ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోతలు మొదలవడంతో ఇబ్బందులు ఉండవని, తాగు, సాగు నీరు గోస తీరుతుందని రైతులు, ప్రజలు భావిస్తున్నారు. గతంలో కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని ప్రాజెక్ట్‌లకు సిరిసిల్ల మానేరు తీరం వారధిగా మారింది. సిరిసిల్ల మానేరు వాగుపై 27 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరుప్రాజెక్ట్ నీటి నిల్వతో 18 కిలోమీటర్ల మేరకు బ్యాక్ వాటర్‌తో జలకళ సంతరించుకుంది. మిడ్ మానేరు ప్రాజెక్ట్‌కు అనుసంధానంగానే జిల్లాలో అనంతారం అన్నపూర్ణ ప్రాజెక్ట్‌ను నిర్మించారు. ఆసియాలోనే అతిపెద్దదైన సర్జిపూల్ నిర్మించి అనంతగిరి ప్రాజెక్ట్‌లోకి నీటిని ఎత్తిపోయడం ద్వారా రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండ పోచమ్మ సాగర్ వరకు కాళేశ్వరం జలాలను పరుగులెత్తించారు. జిల్లా నుంచి గోదావరి జలాలు ఎత్తిపోతలతో ఇతర జిల్లాలకు తరలివెళ్తుంటే సిరిసిల్ల వేములవాడ నియోజకవర్గాల్లోని మెట్ట ప్రాంతాల రైతులు కాళేశ్వరం 9వ ప్యాకేజీ ద్వారా కాలువల నిర్మాణం, నిజాం కాలంలో నిర్మించిన ఎగువ మానేరు ప్రాజెక్ట్‌కు నీటి మళ్లింపుతోపాటు తొమ్మిదేళ్లుగా మూడు టీఎంసీల సామర్థ్యంతో నిర్మించే మల్కపేట రిజర్వాయర్ ఎప్పుడు అందుబాటులోకి వస్తుందని ఆందోళన చెందుతున్నారు.రూ.996 కోట్లతో 9వ ప్యాకేజీ పనులు జిల్లాలోని కాళేశ్వరం 9వ ప్యాకేజీ పనుల ద్వారా సిరిసిల్ల, కోనరావుపేట, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, మండలాల్లో భూగర్భ జలాలు పెరగడంతో ఆయకట్టు పెరుగుతుందని అంచనాలు వేశారు. సిరిసిల్ల మిడ్ మానేరు ప్రాజెక్ట్ నుంచి ఎగువ మానేరు ప్రాజెక్ట్ వరకు రూ.996 కోట్లతో 9వ ప్యాకేజీ పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా కోనరావుపేట మండలం మల్కపేట వద్ద మూడు గుట్టలను అనుసంధానం చేశారు. ఆరు కట్టలతో మూడు టీఎంసీల సామర్థ్యంతో రూ.504 కోట్ల వ్యయంతో ప్రాజెక్ట్ పనులు చేపట్టారు. త్వరలోనే అందుబాటులోకి వస్తుందని భావించినా రైతులకు నిరాశే మిగిలింది. ట్రయల్‌రన్ పూర్తి చేసుకొని ఏడాది గడిచినా కొత్త ప్రభుత్వం దృష్టి సారించడం లేదనే విమర్శలు ఉన్నాయి. సిరిసిల్ల శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ నుంచి మల్కపేట ప్రాజెక్ట్ వరకు నీటిని మళ్లించడానికి 12 కిలోమీటర్ల టన్నెల్, అక్కడ సర్జిపూల్ నిర్మించారు. 30 మెగావాట్ల సామర్థ్యం ఉన్న రెండు పంపుల ద్వారా 560 క్యూసెక్కుల నీటిని ప్రాజెక్ట్‌లోకి ఎత్తిపోస్తారు. మల్కపేట రిజర్వాయర్ ప్రారంభమైతే దాని ద్వారా ఎగువ మానేరు ప్రాజెక్ట్‌లోకి 2 టీఎంసీలు, బత్తుల చెరువు 2 టీఎంసీలు నింపడంతోపాటు వాటి పరిధిలో ఉన్న చెరువులు నిండడం ద్వారా 60 వేల ఎకరాల కొత్త ఆయకట్టు పెరగనుంది. ఇప్పటికే సింగసముద్రం, వరకు కాలువల నిర్మాణాలు చేపట్టారు. మల్కపేట రిజర్వాయర్ అందుబాటులోకి వస్తే జిల్లాలో సమృద్ధిగా సాగునీటి వనరులు అందుబాటులోకి వస్తాయని ప్రాజెక్ట్‌ను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

## చకచకా..
# రుణ మాఫీ ప్రక్రియ

**పెద్దపల్లి:–నవభూమి:** రుణమాఫీ పొందని రైతులను గుర్తించి వారి నుంచి వివరాలు సేకరించే ప్రక్రియను వ్యవసాయశాఖ చకచకా చేపడుతోంది.వ్యవసాయ విస్తరణ అధికారుల సాయంతో జిల్లావ్యాప్తంగా బ్యాంకు రుణం తీసుకొని వివిధ కారణాలతో రుణమాఫీ రాని వారి వివరాలను సేకరించింది. రేషన్‌కార్డు లేనివారు, ఆధార్‌కార్డులో చిరునామా, ఇంటిపేరు, బ్యాంకు ఖాతాలో మరోవిధంగా ఉండటం వంటి సమస్యలు రైతు కుటుంబాలకు ఉన్నట్లు గుర్తించారు. రైతుల వివరాలు, తప్పొప్పులను సరిదిద్ది కుటుంబ నిర్ధారణ చేసి రుణమాఫీ యాప్‌లో పొందుపరిచి రాష్ట్ర వ్యవసాయశాఖకు ఎప్పటికప్పుడు నివేదిస్తున్నారు. ఇంకా అక్కడక్కడ రైతులు తమ ఆధార్ కార్డులను బ్యాంకు ఖాతాలకు అనుసంధానించకపోవడం వల్ల యాప్‌లో వారి పొందుపరిచేందుకు వీలుపడటం లేదు. కొందరు రైతులు విదేశాల్లో ఉండటం, మరికొందరు రైతుల బ్యాంక్ లోన్ ఖాతాలు మనుగడ లేకపోవడం వంటి సమస్యలు ఎక్కువగా అధికారులకు ఎదురవుతున్నాయి.రైతులు రుణమాఫీలో ఎదుర్కొంటున్న సమస్యలను 'ఈనాడు' జిల్లా వ్యవసాయశాఖాధికారి ఆదిరెడ్డితో ప్రస్తావించింది. 12 డిసెంబర్ 2018 నుంచి 9 డిసెంబర్ 2023 వరకు రైతులు తీసుకున్న నూతన, రెన్యువల్ చేసుకున్న రుణాలు అసలు, వడ్డీతో కలిపి రూ.2 లక్షల్లోపు ఉంటే మాఫీ చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి సందేహాలున్నా ఫిర్యాదుల నమోదుకు 1800 599 5459 టోల్ ఫ్రీకి కాల్ చేస్తే వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. యాప్‌లో వివరాలు నిక్షిప్తం జిల్లావ్యాప్తంగా 51,393 మంది రైతులకు మూడు విడతల్లో రూ.375.58 కోట్ల మేర రుణమాఫీ సొమ్మును ప్రభుత్వం విడుదల చేసి వారి బ్యాంకు ఖాతాలకు మళ్లించింది. వీరితోపాటు అదనంగా 12,187 మందికి కుటుంబ సభ్యుల వివరాలు లేకపోవడంతో వారికి మాఫీ సొమ్ము రాలేదు.వారం రోజులుగా అధికారులు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి రైతు రుణమాఫీకి దూరమైన వీరి వివరాలు సేకరిస్తున్నారు.8,308 మంది రైతులకు సంబంధించి రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, కుటుంబ సభ్యుల నిర్ధారణ వంటి ప్రక్రియలన్నీ పూర్తి చేసి రుణమాఫీ యాప్‌లో పొందుపరిచారు. ఇంకా 3,879 మంది రైతు కుటుంబాల వివరాలు యాప్‌లో పొందుపరచాల్సి ఉంది.ప్రభుత్వం రూపొందించిన రుణమాఫీ యాప్‌లో ఆయా రైతుల వివరాలను నమోదు చేయడంతో పాటు కుటుంబం ఫొటో కూడా తీసుకొని నిక్షిప్తం చేస్తున్నారు.కొందరు రైతులకు సంబంధించి ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, బ్యాంకుఖాతా నంబర్ వివరాలు తప్పుగా నమోదైతే సవరించేందుకు అవకాశం ఉండటం లేదు. వీరి వివరాలను ప్రత్యేకంగా ధ్రువపత్రాల నకళ్లు తీసుకుని రాష్ట్ర వ్యవసాయశాఖకు నివేదిస్తున్నారు.



## వృక్షాలకు జీవం



**రాయికల్:-నవభూమి:** మొక్కలు నాటడమే కాదు ఏళ్ల నాటి నుంచి ప్రాణవాయువు అందిస్తున్న మహా వృక్షాలను కాపాడటం పర్యావరణ పరిరక్షణ అని నమ్మి మహా వృక్షాలను కాపాడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఒక్కరి ఆలోచనకు గ్రామం అంతా ఏకమై వృక్షాల రక్షణకు శ్రీకారం చుట్టారు. ఒక చోట తొలగించిన వృక్షాలకు మరో చోట ప్రాణం పోసి కాపాడుతున్నారు. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన సుంకిశాల సత్తయ్య అనే గీత కార్మికుడు హైదరాబాద్‌లోని వటా ఫౌండేషన్ స్ఫూర్తితో రహదారులు, భవనాల నిర్మాణంలో తొలగించే మహా వృక్షాలను ఇతర చోట నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామస్థులు, గంగాదేవి ఉద్యానవన కమిటీ సహకారంతో గ్రామ శివారులోని మామిడి తోట ఆవరణలో సుమారు 15 నుంచి 18 ఏళ్ల రావి, జువ్వి ఇతర రకాల 13 చెట్లను తొలగించగా వాటిని గ్రామంలోని పలు చోట్ల నాటి రెండు మాసాల్లో 12 చెట్లకు ప్రాణం పోశారు. చెట్లను ఇతర ప్రాంతాలకు తరలించి నాటడానికి అయ్యే ఖర్చులు గ్రామస్థులు భరిస్తున్నారు. ఒక్కో వృక్షాన్ని తరలించి కాపాడటానికి సుమారు రూ.2 వేల వరకు ఖర్చవుతుండగా గ్రామానికి చెందిన హిమవంతరావు, గ్రామస్థులు భరించి వృక్షాలను కాపాడారు. ఏళ్ల నాటి చరిత్ర గల మహా వృక్షాలను ట్రాన్స్‌ప్లాంటేషన్(మళ్లీ నాటడం) పద్ధతిలో తరలించి అనువైన చోట నాటడం ద్వారా పర్యావరణ రక్షణ సాధ్యమవుతుందని చాటుతున్నారు. జిల్లాలో జగిత్యాల-కరీంనగర్ రహదారిలో ఏళ్ల నాటి వృక్షాలను ఇదే పద్ధతిలో ఇతర చోట నాటాలని ఇటీవల జిల్లా కలెక్టర్‌ను కమిటీ సభ్యులు కోరారు. రాయికల్ అటవీ అధికారులు పరిశీలించి ఇటీవల గ్రామస్థులను అభినందించారు.

## ధరల దాడిని ఎదుర్కొందాం!

**కరీంనగర్:-నవభూమి:** ప్రస్తుతం మార్కెట్‌లో రూ.500 పెట్టినా వారానికి సరిపడా కూరగాయలు తీసుకెళ్లే పరిస్థితి లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జనాభా పెరుగుతుండటం కూరగాయల సాగు తగ్గుతుండటంతో ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. కోతులు, వన్యప్రాణులు, పక్షులతో ఇబ్బందితోపాటు మార్కెటింగ్ సమస్యలతో ఉమ్మడి జిల్లా అన్నదాతలు కూరగాయల సాగుపై దృష్టి పెట్టడం లేదు. పెరుగుతున్న ఆసక్తి ధరల పెరుగుదల, పురుగు మందుల వినియోగం పెరుగుతుందన్న ఆలోచనతో చాలామంది మహిళలు ఉమ్మడి జిల్లాలో మిద్దె, పెరటి తోటల్లో కూరగాయలు పెంచుతున్నారు. రసాయన ఎరువులు వాడకుండా వంటింటి వ్యర్థాలను పోగు చేసి సేంద్రియ ఎరువులుగా మార్చి కూరగాయల మొక్కలకు వేస్తున్నారు. వాట్సప్ సమూహాలు, అంతర్జాలం వేదికగా చీడపీడల గురించి తెలుసుకుంటూ వాటికి విరుగుడుగా కషాయాలను తయారు చేస్తూ దిగుబడి పొందుతున్నారు. ఆన్‌లైన్‌లో పలు సంస్థలు మంచి విత్తనాలు, సేంద్రియ ఎరువులు విక్రయిస్తుండటంతో మంచి సంస్థల గురించి తెలుసుకుని కొనుగోలు చేస్తున్నారు. పెరటి, మిద్దె తోటల్లో పనితో వ్యాయామంగా ఉండటంతోపాటు పచ్చని మొక్కల మధ్య గడపడంతో ఉత్సాహంగానూ ఉంటుందని ఆ మహిళలు వెల్లడిస్తున్నారు. కొన్నేళ్ల కిందట వేళ్ల మీద లెక్కపెట్టే విధంగా ఇళ్లపైన, పెరట్లో కూరగాయల్ని సాగుచేసేవారు. కానీ మారుతున్న పరిస్థితుల్లో మేడపైన వీటిని పెంచుతున్న వారి సంఖ్య ఇప్పుడు వేలల్లోకి చేరింది. కరీంనగర్, రామగుండం కార్పొరేషన్‌ల పరిధిలోనే సుమారుగా 800ల మందికి పైగా ఇలా సాగు చేస్తున్నారని అంచనా. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపుగా 5 వేల మంది ఇళ్ల చెంతన కూరగాయల్ని ఎంతో కొంత వరకు పండిస్తున్నట్లు సమాచారం. కొంతమంది పల్లెల్లో ఇంటి ఆవరణలో ధరలు ఎక్కువగా ఉండే వాటిని పండిస్తూ ఇంటి అవసరాలకు వాడుకుంటున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పట్టణాల్లోని నివాస గృహాల్లో ఈ తరహా పెరటి తోట సంస్కృతి పెరిగితే కూరగాయల పరంగా ఆర్థిక భారం తగ్గే వీలుంది.



# చెరువు హద్దుల సర్వే

**పెద్దపల్లి, -నవభూమి:** చెరువులు, కుంటల శిఖాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. అనుమతులు లేకుండా కబ్జారాయుళ్లు నిర్మించిన కట్టడాల కారణంగా లోతట్టు ప్రాంతాలకు వరదనీరు ఉప్పొంగుతోంది. పలు కాలనీల్లో నీరుచేరి ఆయా ప్రాంతాలవారు ఇక్కట్లకు గురవుతున్నారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చెరువుల సంరక్షణ కోసం జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లో 'హైడ్రా' తరహాలో చెరువుల్లోని అక్రమ కట్టడాలను గుర్తించి, తొలగింపు చర్యలు ముమ్మరం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడంతో గత వారం రోజుల నుంచి అధికారులు చెరువుల్లో సర్వేలు చేపడుతున్నారు. రెవెన్యూ, నీటిపారుదల, పురపాలిక, భూమి కొలతలు, రికార్డుల శాఖలతో టాస్క్‌ఫోర్స్ కమిటీ బృందం ఆధ్వర్యంలో సర్వే నిర్వహిస్తున్నారు. అత్యాధునిక సాంకేతికత ఆధారంగా సర్వే రెవెన్యూ, సర్వేయర్లు, నీటిపారుదల శాఖాధికారులు ప్రస్తుతం జిల్లాలో డిజిటల్ గ్లోబల్ పోజిషనింగ్ సిస్టం(డీజీపీఎస్) యంత్రాల ద్వారా ఎప్పటికప్పుడు చెరువుల సరిహద్దులు, నీటి మట్టాల స్థాయి, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను గుర్తించి నివేదికల రూపంలో పొందుపరుస్తున్నారు. 'గూగుల్ ఎర్త్' ద్వారా ఆన్‌లైన్‌లో చెరువు హద్దులు గుర్తించి వాటి ఆధారంగా మళ్లీ క్షేత్రస్థాయిలో సర్వే చేయాలని సంబంధిత అధికారులు సర్వేయర్లకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలు ఉంటే వాటి సమాచారాన్ని పుర, నగర పాలక సంస్థ అధికారులకు ఇచ్చి కూల్చివేయాలని పేర్కొంటున్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బంధంపల్లి చెరువులో అక్రమంగా నిర్మించిన గోడలు, రేకుల షెడ్లను ఇప్పటివరకు జరిగి సర్వేలో గుర్తించి కూల్చివేశారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని తాళ్లకుంట చెరువులోని బఫర్ జోన్‌లో పెద్దపల్లి పురపాలక శాఖకు చెందిన డంపింగ్ యార్డు



ఉన్నట్లు గుర్తించారు. అనుమతి లేని రేకుల ఇళ్లు కూడా ఉన్నట్లు గుర్తించారు. జిల్లా కేంద్రంలోని రంగంపల్లి చెరువు బఫర్ జోన్‌లో అక్రమంగా.. అసంపూర్తిగా నిర్మించిన ఇళ్లు గుర్తించినట్లు భూమి కొలతలు, రికార్డుల శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసులు 'ఈనాడు'కు తెలిపారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మ, గుండమ్మ చెరువుల పరిధిలోని ఎఫ్‌టీఎల్ పరిధిలో కొందరు రేకుల ఇళ్లు నిర్మించారనే ఫిర్యాదులు వచ్చాయి. సుల్తానాబాద్‌లోని సుగ్లాంపల్లి గ్రామంలోని దొరసాని కుంటలో గతంలో కొందరు వ్యక్తులు అక్రమంగా నిర్మించిన బియ్యం గోదాములున్నాయని ఫిర్యాదులు వచ్చాయి. మంథనిలోని రావుల కుంట చెరువు, రామగుండంలోని పెద్దచెరువు, మల్లపురాణి కుంట, అడ్డగుంటపల్లి చెరువుల్లోనూ అక్రమ నిర్మాణాలున్నాయని ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో వీటిని డీజీపీఎస్, లైడార్ ప్రక్రియల ద్వారా గుర్తించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 1,016 చెరువులుండగా నీటి నిల్వ స్థాయిని మించి అలుగు పోస్తున్న చెరువులు మొత్తం 445 ఉన్నట్లు జిల్లా నీటిపారుదలశాఖ పర్యవేక్షకులు(ఎస్‌ఈ) సత్యరాజ్‌చంద్ర 'ఈనాడు'తో పేర్కొన్నారు. నిండుగా ఉన్న చెరువుల్లో సర్వే చేయడం ఇబ్బందికరంగా ఉంటే 'లైడార్' సర్వే చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. డ్రోన్ కెమెరా సాయంతో చెరువుల్లో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను గుర్తిస్తామని పేర్కొన్నారు. ఇవీ నిబంధనలు చెరువు శిఖంలో ఎలాంటి విద్య, వైద్య సంస్థలు, ఇతరత్రా వెంచర్లు, లేక్‌వ్యూలు, ఫామ్‌హౌస్‌ల వంటి నిర్మాణాలు చేపట్టవద్దని ప్రభుత్వం నిబంధనలు విధించింది. ఎఫ్‌టీఎల్ దాటిన తర్వాత 30 మీటర్ల మేర ఉన్న ప్రాంతాన్ని బఫర్ జోన్ అంటారు. ఎఫ్‌టీఎల్ మార్గదర్శకాలనే బఫర్ జోన్‌కు వర్తింపజేశారు. కాలువలు, నాలాలు, కుంటల పరిధిలో 9 మీటర్ల వరకు బఫర్ జోన్ ఉంటుంది. వీటి పక్కన నిర్మాణం చేపట్టాలంటే 9 మీటర్లు దాటిన తర్వాతే నిర్మించాల్సి ఉంటుంది. గ్రామాల విషయానికొస్తే ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో ప్రభుత్వం పంటలు వేసుకునేందుకు రైతులకు వెసులుబాటు కల్పించింది. కొందరికి పట్టాభూములు సైతం కేటాయించింది. నిబంధనల ప్రకారం వీటిని సాగు చేసుకునేందుకు తప్ప క్రయ, విక్రయాలకు అనుమతులు ఇవ్వలేదు. కొందరు ఆయా శాఖాధికారుల కళ్లుగప్పి, నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఇలాంటి వాటినే జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ గుర్తించి కూల్చివేయాలని నిర్ణయించింది.

# ఉబికి వస్తున్న కన్నీళ్లు

**గంగాధర: -నవభూమి:** వారి ఇళ్లలో నీరు ఉబికి వస్తోంది. గోడలు తడిసి నిత్యావసరాలు పాడవుతున్నాయి. ఇంట్లోంచి నీటిని బయటకు ఎత్తిపోస్తున్నారు. కొన్నేళ్లుగా ఇదే దుస్థితి అని నారాయణపూర్, గంగాధర జలాశయాల ముంపు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువు కట్టలు తెగిపోయే ప్రమాదం ఉండటంతో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. వర్షాకాలంలో అయితే ముంపు గ్రామాల ప్రజలు వణికిపోతున్నారు. తమ ఊళ్లను స్వాధీనం చేసుకుని పునరావాసం కల్పించాలని వేడుకుంటున్నారు. ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ పమేలా సత్పతి నారాయణపూర్ గ్రామాన్ని సందర్శించి ముంపు బాధితులకు భరోసా కల్పించారు. కానీ ఇప్పటికీ చర్యలు చేపట్టలేదు. పరిహారానికి నిరీక్షణే.. జలాశయం నిర్మాణంలో కోల్పోయిన 236 ఎకరాల వ్యవసాయ భూములతోపాటు బావులు, పైపులైన్లకు నష్టపరిహారం చెల్లించాలి. పదేళ్ల కిందటే రూ.10 లక్షల చొప్పున ప్రకటించినా ఇంతవరకు మంజూరు కాలేదు. మంగపేటలో 11 ఇళ్లు, నారాయణపూర్ చెరువు కట్ట కింద 31 ఇళ్లు ముంపునకు గురవుతున్నాయని గతంలో అధికారులు గుర్తించారు. నిధులు మంజూరు చేసినా ఇప్పటివరకు ఒక్క పైసా కూడా బాధితులకు చెల్లించలేదు. చర్లపల్లి-ఎన్, ఇస్తారుపల్లి గ్రామాల్లోనూ ముంపు సమస్యలతో ప్రజలు ఏటా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోటెత్తిన వరద.. ఇళ్లలో ఊట జిల్లాలోని గంగాధర, నారాయణపూర్ జలాశయాలను ఎల్లంపల్లి నీటితో నింపి జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలోని పలు ప్రాంతాలకు సాగునీటిని అందిస్తున్నారు. అయితే 0.3 టీఎంసీల సామర్థ్యం గల ఈ చెరువుల కట్టలను అభివృద్ధి చేయకుండా ఏళ్లుగా నీటిని నింపుతుండటం సమస్యగా మారింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నారాయణపూర్ చెరువు నిండుకుండలా మారింది. ఇళ్లలో నీటి ఊటలు వస్తుండగా గోడలు తడిసిపోతున్నాయి. రెండేళ్ల కిందట నారాయణపూర్ చెరువు, గంగాధర ఎల్లమ్మ చెరువు కట్టకు గండ్లు పెట్టగా వరద ఉధృతితో భయానక పరిస్థితి నెలకొంది. నారాయణపూర్ చెరువు కట్ట వెడల్పు, ఎత్తు పెంచకుండా.. కేవలం చెరువు మత్తడి వద్ద లక్షలాది రూపాయలతో ఎత్తు పెంచడంతో నీటి నిల్వ సామర్థ్యం పెరిగి కట్టకు సమాంతరంగా వరద చేరింది. ఏ క్షణంలోనైనా కట్ట తెగిపోయే ప్రమాదం ఉండటంతో ముంపు బాధితులు భయాందోళన చెందుతున్నారు.



## తేలిన సాగు లెక్క



**జగిత్యాల -నవభూమి:** జిల్లాలో వానాకాలం సాగు వివరాలను వ్యవసాయాధికారులు క్షేత్రసర్వే ద్వారా గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదుచేసే ప్రక్రియ దాదాపుగా తుదిదశకు చేరింది.ఏఈవోలకు మొబైల్‌యాప్‌ను కేటాయించి తెలంగాణ భూనక్షా(కడస్ట్రాల్ మ్యాప్)ను యాప్‌తో అనుసంధానించి ఉపగ్రహ సాంకేతికతతో అక్షాంశాలు, రేఖాంశాలు, ధరణి చిత్రపటాల ఆధారితంగా పంటలు, వివరాల నమోదు చేపట్టారు. ఏఈవోలు రైతు పొలానికివెళ్లి భూనక్షా మ్యాప్‌ను ఆన్‌చేసి రైతుపేరు, విస్తీర్ణం, ఆధార్‌కార్డు, గ్రామం, గతంలో, ప్రస్తుతం సాగుచేసిన పంటరకం, పెట్టుబడిఖర్చు, చీడపీడలు, పంటనష్టం, ఎరువుల వాడకాన్ని, పంట ఫొటోతోసహా అప్‌లోడ్ చేస్తున్నారు. రైతులతో జరిపే సమావేశాలు, శిక్షణలు, రైతుబీమా క్లెయిముల పరిశీలన, విత్తన పర్మిట్ల జారీ, ధాన్యం సేకరణ కేంద్రాల్లో విధులు, మట్టినమూనాల సేకరణ, పంట దిగుబడి అంచనా, ప్రదర్శన క్షేత్రాల ఏర్పాటు, రైతుభరోసా, పీఎంకిసాన్, పంట ఉత్పాదకాల పంపిణీ తదితర 17 రకాలకుపైగా విధుల నిర్వహణను ఏఈవోలు తమ క్లస్టర్ల పరిధిలోనుంచే అప్‌లోడ్ చేస్తున్నారు.మొబైల్‌యాప్ ద్వారా వివరాల నమోదు వానాకాలం పైర్లసాగు అదను ముగియగా ఇప్పటివరకు జిల్లాలోని 71 క్లస్టర్ల పరిధి 3,63,931 ఎకరాల్లోని సాగువివరాలను ఆన్‌లైన్ చేశారు. ఈ వానాకాలంలో రికార్డుస్థాయిలో 3.07 లక్షల ఎకరాల్లో వరిపంటను రైతులు సాగుచేస్తున్నట్లు తేలింది. మక్కలో పసుపును అంతర పంటగా విత్తుకున్నారు. నమోదుకు 50 మీటర్ల పరిధిలోనే సర్వేనంబర్లు కనిపిస్తాయి కాబట్టి ఏఈవోలు తప్పనిసరిగా రైతు క్షేత్రానికి వెళ్లి నమోదు చేపట్టారు. దీంతో వివరాల నమోదులో కచ్చితత్వం పెరిగి పంటఉత్పత్తుల విక్రయంలో రైతులకు ఇబ్బందులు తలెత్తవు. అన్ని వివరాల నమోదు ద్వారా నేలస్వభావం, సాగునీటి లభ్యత, గతంలోని చీడపీడలు, వాతావరణం, దిగుబడులు తదితరాలను బట్టి వచ్చే సీజన్లలో ఏ పంటలు సాగుచేయాలో నిర్దేశిస్తారు. చీడపీడల నివారణకు మందుల రూపకల్పన, నూతన వంగడాల ఆవశ్యకత శాస్త్రవేత్తల ప్రయోగాలకు మార్గదర్శనంగా ఉండనుంది. పంటనష్టం వాటిల్లినపుడు పరిహారం పంపిణీ, దిగుబడులనుబట్టి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు తదితరాలను ప్రభుత్వం నిర్దేశిస్తుందని జిల్లా వ్యవసాయాధికారిణి బి.వాణి తెలిపారు.

## అవగాహనతోనే ఎయిడ్స్ అంతం

**జమ్మికుంట:-నవభూమి:** అవగాహన ఉంటేనే ఎయిడ్స్ అంతం సాధ్యమని హుజూరాబాద్ డీఎస్ఆర్పీ కౌన్సిలర్ బత్తుల బబిత అన్నారు. బుధవారం జమ్మికుంటలోని లారీ డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులకు ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ బబిత మాట్లాడుతూ.. వృత్తిలో భాగంగా చాలా రోజులపాటు ఇంటిని వదిలి సుదూర ప్రదేశాలకు వెళ్లవలసి వస్తుందని, అలాంటి సమయంలో పర స్త్రీలతో కలవడం వల్ల హెచ్ఐవీ వచ్చే అవకాశాలు ఉన్నాయని డ్రైవర్లకు తెలియజేశారు. హెచ్ఐవీ సోకిన వ్యక్తులు అధైర్య పడకుండా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించుకొని సరియైన మందులు వాడడం ద్వారా ఆ వ్యాధిని పెరగకుండా చూడవచ్చునని పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు హెచ్ఐవీ ఎయిడ్స్‌పై ప్రత్యేక దృష్టి సారించి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయని వెల్లడించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి మంచి ఆరోగ్యంతో పాటు మంచి కుటుంబాన్ని ఏర్పరచుకొని ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో లారీ డ్రైవర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు పొన్నగంటి మల్లయ్య, అధ్యక్షులు రామస్వామి, ప్రధాన కార్యదర్శి రియాజ్ డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ రహదారి
# విస్తరణకు అడుగులు

**వేములవాడ:-నవభూమి:** దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడ పట్టణంలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయం ముందు ప్రధాన రహదారి విస్తరణకు నోచుకోనుంది.రహదారి విస్తరణలో నష్టపోయే ఇళ్లకు సంబంధించి భూసేకరణకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో రోడ్డు విస్తరణకు అడుగులు ముందుకు పడుతున్నాయి. ఇది జరిగితే పట్టణ ప్రజల ఏళ్ల నాటి కల నెరవేరనుంది.రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి రాజన్న దర్శనానికి రోజూ వేలాది మంది భక్తులు వస్తుంటారు. వీరితోపాటు స్థానికులతో ఈ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. పలు సందర్భాల్లో ఈ రహదారి పద్మవ్యూహాన్ని తలపిస్తుంటుంది. తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగి భక్తులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడటం సర్వసాధారణమైంది. ఈ రహదారిని ఆలయం ముందు నుంచి తిప్పాపూర్ వంతెన వరకు విస్తరించాలన్న ప్రతిపాదనలు గత కొన్నేళ్లుగా కార్యరూపం దాల్చడం లేదు.గత ఏడాది రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీఏడీఏ), సర్వే అధికారులు సర్వే చేసి అంచనాలు రూపొందించారు.గత ప్రభుత్వ హయాంలో రహదారి విస్తరణకు రూ.35 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించినా నిధులు విడుదల కాక పనులు ముందుకు సాగలేదు. ప్రస్తుత ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ తీసుకొని రహదారి విస్తరణ పనులను వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టడంతో ప్రభుత్వం భూసేకరణకు నోటిఫికేషన్ జారీ చేసింది. తిరిగి సర్వే నిర్వహించి విస్తరణ పనులు చేపట్టనున్నారు.



దీంతో ఈసారి రహదారి విస్తరణకు మోక్షం లభించనుందని భావిస్తున్నారు.నష్టం ఏర్పడే ఇళ్ల సంఖ్య 243 రహదారి విస్తరణతో ఆలయం ముందు నుంచి మూలవాగు వంతెన వరకు దాదాపు 243 ఇళ్లకు నష్టం ఏర్పడనున్నదని అధికారులు అంచనా వేశారు. 80 అడుగుల వరకు విస్తరించనున్నారు. బాధితులకు పరిహారం కింద దాదాపు రూ.47 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. రెండు నెలల్లో సర్వే పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక అందించేందుకు చర్యలు చేపడుతున్నారు.ఇవీ ఇబ్బందులు రాజన్న దర్శనానికి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుండటంతో వాహనాలు కూడా దాదాపు వేయి వరకు ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. వీరితో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు వివిధ పనుల కోసం పట్టణానికి వస్తుంటారు. దీంతో ఎప్పుడూ రద్దీగా ఉంటుంది.అత్యవసర పరిస్థితుల్లో ఈ ప్రాంతంలోని వారు పడే ఇబ్బందులు వర్ణనాతీతం. కొన్ని సందర్భాల్లో కనీసం పాదచారులు కూడా వెళ్లలేనంత రద్దీ ఉంటుంది.రాజన్న ఆలయంలో జరిగే వివిధ ఉత్సవాల సమయంలో జన సంద్రంగా మారుతుంది. ఇలాంటి సందర్భంలో భక్తులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. రహదారి విస్తరణతో ఈ ఇబ్బందులు తొలగిపోనున్నాయి.రెండు నెలల్లో సర్వే పూర్తి రాజేశ్వర్, ఆర్డీవో, వేములవాడ రాజన్న ఆలయం ముందు నుంచి తిప్పాపూర్ వంతెన వరకు రహదారి విస్తరణకు భూసేకరణ కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. రెండు నెలల్లో రహదారి విస్తరణలో కోల్పోయే ఇళ్లను సర్వే చేసి నివేదికను ప్రభుత్వానికి పంపనున్నాం. నివేదిక ఆధారంగా ప్రభుత్వం రహదారి విస్తరణ పనులకు చర్యలు చేపట్టనున్నది.

# అమ్మలేం.. నడపలేం

**సిరిసిల్ల : -నవభూమి:** జిల్లా వస్త్ర పరిశ్రమకు విద్యుత్తు బిల్లులు గుదిబండగా మారాయి. తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లోని వస్త్ర పరిశ్రమలకు అక్కడి ప్రభుత్వాలు విద్యుత్తు యూనిట్లకు రాయితీ, బిల్లుల్లో తగ్గింపులు ఇస్తున్నాయి.జిల్లాలో మాత్రం కుటీర పరిశ్రమగా ఉన్న మరమగ్గాలకు నాలుగో కేటగిరీలో యాభై శాతం రాయితీ ఉంది. మిగతా ఎస్ఎస్ఐ యూనిట్లకు, టెక్స్‌టైల్ పార్కులోని పరిశ్రమలకు మాత్రం ఎలాంటి రాయితీ లేదు. గత ప్రభుత్వంలో టెక్స్‌టైల్ పార్కుకు పలు విడతల్లో విద్యుత్తు రీయింబర్స్‌మెంటును విడుదల చేసింది. సిరిసిల్లలోని ఎస్ఎస్ఐ యూనిట్లకు ఇప్పటికీ రూ.20 కోట్లపైన బకాయిలు ఉన్నాయి. ఈ బిల్లులు చెల్లించలేక మూసివేశారు. మరికొంత మంది సందిగ్ధంలో ఉన్నారు. జిల్లా వస్త్ర పరిశ్రమలో నెలకొన్న విద్యుత్తు సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతూ ఇటీవల ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఈఆర్‌సీకి లేఖ రాశారు. ఇక ప్రభుత్వం తీసుకునే నిర్ణయం కోసం నేతన్నలు ఎదురుచూస్తున్నారు.జిల్లాలో మరమగ్గాల వస్త్రోత్పత్తితో విద్యుత్తు వినియోగం భారీగా పెరిగింది. కుటీర పరిశ్రమలుగా ఉన్న వాటికి మాత్రమే ప్రభుత్వం యాభై శాతం రాయితీ వర్తిస్తుంది. అది కూడా పది హెచ్‌పీల వరకే పరిమితి.జిల్లాలో 2018 తర్వాత మరమగ్గాల సంఖ్య పెరిగింది. వీటిలో ఎక్కువగా ఎస్ఎస్ఐ యూనిట్లు ఉన్నాయి. వీటి సామర్థ్యం పది హెచ్‌పీ నుంచి ఇరవై హెచ్‌పీలకు పెరిగింది. ఈ యూనిట్లు ఏర్పాటు చేసుకున్నవారు ప్రభుత్వ ఆర్డర్లకు చేనేత, జౌళిశాఖకు ఎస్ఎస్ఐ యూనిట్లుగా పేర్కొన్నారు. దీంతో వీరి విద్యుత్తు వినియోగం, ప్రభుత్వ రాయితీలపై సెస్ విచారణ చేసింది. ఎస్ఎస్ఐ యూనిట్లకు ప్రభుత్వ రాయితీ వర్తించదని చేనేత, జౌళిశాఖ తేల్చి చెప్పింది. దీంతో ఈ ఎస్ఎస్ఐ యూనిట్లన్నీ ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుని మూతపడ్డాయి.తమిళనాడులోని మరమగ్గాలకు ఉచిత విద్యుత్తును 750 నుంచి వెయ్యి యూనిట్లకు అక్కడి ప్రభుత్వం పెంచింది. 1,500 యూనిట్ల వరకు యూనిట్‌కు రూ.4.15, ఆపైన అయితే రూ.5.30 చేశారు. కర్ణాటకలో పది హెచ్‌పీల నుంచి 20 హెచ్‌పీలకు సామర్థ్యం పెంచారు. దీనిలో యూనిట్‌కు పరిశ్రమ వర్గాలు రూ.1.25 చెల్లించాలి. మహారాష్ట్రలో మరమగ్గాలకు యూనిట్‌కు రూ.2 చొప్పున చెల్లించాలి.ప్రభుత్వం ప్రతిసారి రీయింబర్స్‌మెంటు ఇవ్వడం సాధ్యం కాకపోవచ్చు. పెరుగుతున్న విద్యుత్తు బిల్లుల భారాన్ని తగ్గించుకునేందుకు మరో ప్రత్యామ్నాయం సౌర విద్యుత్తు వాడకం. టెక్స్‌టైల్ పార్కులోని 112 యూనిట్లలో ఏడు యూనిట్లు సౌర విద్యుత్తును ఏర్పాటు చేసుకున్నాయి. ఒక్కో పరిశ్రమ సామర్థ్యాన్ని బట్టి 50-75 కిలోవాట్లతో యూనిట్లను ఏర్పాటు చేసుకోవచ్చు. 75 కిలోవాట్లు సామర్థ్యం ఉన్న యూనిట్కు రోజుకు 300 కిలోవాట్ల విద్యుత్పత్తి అవుతుంది. సగటున 50 కిలోవాట్ల సామర్థ్యానికి రూ.17-20 లక్షల వరకు ఖర్చవుతుంది. తర్వాత వీటి ఏర్పాటు ఖర్చులు పెరగడంతో యజమానులు వెనక్కి తగ్గారు.

